జంట జలాశయాల గేట్ల ఎత్తివేత

సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గండిపేట్ రిజర్వాయర్‌కు భారీ స్థాయిలో వరద నీరు వచ్చిన విషయం తెలిసిందే. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరగా.. మంగళవారం రాత్రి 11:30 గంటల సమయంలో 2 గేట్లు ఒక అడుగు మేర ఎత్తి 234 క్యూసెక్కుల నీటిని కిందకి విడుదల చేశారు. అటు హిమాయత్ సాగర్ జలాశయానికి సైతం వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి దగ్గరలో ఉంది. దీంతో బుధవారం సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో రిజర్వాయర్ 1 గేటు అడుగుమేర అధికారులు ఎత్తి 348 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో అధికారులు దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

28న నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవం

● ముఖ్య అతిథిగా రాష్ట్రపతి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవాన్ని ఈనెల 28న నిర్వహిస్తున్నామని యూనివర్సిటీ ప్రతినిధి తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఈ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా వస్తున్నారని, గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పి.ఎస్.నర్సింహాలు హాజరవుతారని తెలిపారు. స్నాతకోత్సవానికి నల్సార్ యూనివర్సిటీ చాన్సలర్‌గా జస్టిస్ అలోక్ అరాదే వ్యవహరిస్తారని, వర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించిన 50 మందికి గోల్డ్ మెడల్స్‌ను అందజేస్తారని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్-2024

సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): దేశంలో స్టార్టప్ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్-2024ను 3 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ నెల 26 నుంచి గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జరిగే ఈ స్టార్టప్ ఫెస్టివల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ప్రారంభిస్తారని స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జేఏ చౌదరి తెలిపారు. 3 రోజులపాటు జరిగే స్టార్టప్‌లో.. స్టార్టప్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతోపాటు దేశంలోని వివిధ కంపెనీలు, ఆయా ప్రతినిధులు చర్చల్లో పాల్గొంటారని తెలిపారు. స్టార్టప్ కార్యకలాపాలు నచ్చితే పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, ఈ ఫెస్టివల్ సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రం మారనుందని ఆయన వెల్లడించారు.

దక్షిణ డిస్కంలో వెండర్ల సమస్యను పరిష్కరించాలి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో పెండింగ్‌లో ఉన్న వెండర్ల సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కందుకూరి శ్రీనివాస్, ఎం.వెంకటేశ్‌లు కోరారు. ఈ మేరకు బుధవారం వారు.. సీఎండీ ముషారఫ్ ఫరూఖీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో ఎన్నో ఏండ్లుగా కాంట్రాక్టర్లుగా పనిచేస్తున్నవారు కొత్త నిబంధనలతో కాంట్రాక్టు పనులు చేసే అవకాశాన్ని కోల్పోతారని, సంస్థలో 25 ఏండ్లుగా ప్రాజెక్టులు చేసిన అనుభవం ఉన్నా కొత్తగా వెండర్ రిజిస్ట్రేషన్ వల్ల కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వందలాది మంది కాంట్రాక్టర్ల ద్వారా ఎంతోమంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని, తమకు సంస్థ నుంచి కాంట్రాక్టు పనులు రాకపోతే వారంతా ఉపాధి కోల్పోతారని అన్నారు. సంస్థలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరామని అన్నారు.

క్షణక్షణం.. భయం భయం..

ఇండ్లు ఖాళీచేసి రోడ్డుమీదకు

సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో జీహెచ్ఎంసీకి సంబంధించిన పాత జైలు ఖానా పురాతన భవనం గోడ కూలి.. పక్కనే ఉన్న దుకాణాలు, ఇండ్లపై పడి ధ్వంసం కావడంతో బాధితులు భయాందోళనకు గురయ్యారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని క్షణ క్షణం భయపడుతూ ఇండ్లు ఖాళీ చేసి సామగ్రి, దుస్తులు తీసుకుని రోడ్డుపై పెట్టుకున్నారు. ఎటు వెళ్లాలో తెలియక పడిగాపులు కాస్తున్నారు.

బీసీ కులగణన చేపట్టండి..

లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

- చట్ట సభల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి..
- అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షులు

సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత పద్మశాలీ సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు శివ శంకర్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 25: రాష్ట్రంలోని బీసీల విశ్వసనీయత కోల్పోక ముందే బీసీ కులగణన చేసే ప్రక్రియను మొదలు పెట్టాలని లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బొల్ల శివశంకర్ అన్నారు. బీసీ కుల సంఘాల ఐక్యత కోసం ఈ నెల 26న నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి కొన్ని కులాలే రాజ్యమేలుతుండటంతో బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థికంగా అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. చట్ట సభల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని, బీసీల కులగణన చేయకుండా ప్రభుత్వం సాకులు చెబితే ఊరుకునే ప్రసక్తే లేదని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచందర్, రాష్ట్ర నేతలు భాస్కర్, కందగట్ల భిక్షపతి, శ్రీనివాస్, గుర్రం శ్రవణ్, నరేందర్, బిళ్ల దీపిక, బొమ్మ ప్రవళిక, రాకేశ్, బొమ్మ అమరేందర్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉద్యోగుల అంతరాష్ట్ర బదిలీల ప్రక్రియ

టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ

ఉద్యోగుల అంతరాష్ట్ర బదిలీలకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు అంగీకరించాయని, త్వరలోనే ఈ బదిలీల ప్రక్రియ పూర్తవుతుందని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ అన్నారు. ఈ మేరకు బుధవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో పలువురు ఉద్యోగులు ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరు రాష్ట్రాల ఉద్యోగుల అంతరాష్ట్ర బదిలీలకు తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు అంగీకరించా యని అన్నారు. స్వరాష్ట్రానికి చెందిన ఉద్యోగులు తెలంగాణకు వస్తారని, తెలంగాణలో పని చేస్తున్న ఆంధ్ర ఉద్యోగులు అక్కడికి వెళ్తారని అన్నారు. ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

– సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 25

ప్రభుత్వ పాఠశాల దారిని యథావిధిగా కొనసాగించాలి

భూదాన్ పోచంపల్లిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 25 : పట్టణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల దారిని యథావిధిగా కొనసాగించి, గేటు నిర్మాణాన్ని పునర్నిర్మాణం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లవుడియ రాజు కోరారు. పట్టణ కేంద్రంలోని నేతాజీ ప్రధాన చౌరస్తా వద్ద బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల దారి పాఠశాల ప్రారంభించినప్పటి నుంచి ఉందని, అలాంటి దారిని కబ్జా చేసి నిర్మాణం చేశారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే అధికారులు స్పందించి కూల్చివేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల దాడిని గేటును నిర్మించకపోతే విద్యార్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సభ్యులు కోట రామచంద్రా రెడ్డి, మంచాల మధు, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగా దేవి సాయినాథ్, సిద్ధగోని పరమేశ్, ఎస్ఎఫ్ఐ నాయకులు వికాస్ పాల్గొన్నారు.

కృష్ణ కౌండిన్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

తండు కృష్ణ కౌండిన్యకు సన్మానం

రామన్నపేట, సెప్టెంబర్25 : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని స్వీకరించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు తండు కృష్ణ కౌండిన్యను బుధవారం కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ రహత్‌ఖానం మాట్లాడుతూ... సాహితీవేత్తగా, ఉపాధ్యాయుడిగా ఎంతో గుర్తింపు పొందిన కృష్ణ కౌండిన్యకు అవార్డు రావడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు జేసీ బాబు, లక్ష్మీనీలిమా, వెంకటేశ్వర్లు, సునీత, అనిత, రత్న మంజుల, కిషన్, బ్రహ్మం, రవీందర్ పాల్గొన్నారు.

కోర్టు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

లడ్డూ కల్తీపై న్యాయవాదుల నిరసన

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): కోట్లాది మంది భక్తులు విశ్వసించే శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ కల్తీపై హిందూ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పీఠం ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టుల ముందు నిరసన చేపట్టారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు నుంచి తీసిన నెయ్యిని కలిపి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, హిందువుల ఆలయాలను, పవిత్రతను పరిరక్షించేందుకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు రామారావు, అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు మట్టపల్లి శ్రీనివాస్, హిందూ న్యాయవాదుల సంఘం నాయకులు నరేశ్‌కుమార్, గురువయ్య గౌడ్, నగేశ్, శ్రీకాంత్, సుధాకర్, శోభ, మీనాక్షితో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి చూపాలి

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి సవాల్

యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే మల్లారెడ్డికి వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్25 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గత మూడేండ్ల కాలంలో రాష్ట్రంలో 3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించే విధంగా చర్యలు తీసుకున్నారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ ఆ స్థాయిలో రెట్టింపు పంటలు పండించి చూపిస్తే పాలాభిషేకం చేస్తామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సవాల్ విసిరారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామిని బుధవారం ఆయన కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశానికే అన్నంపెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ తీసుకువచ్చారని, ప్రపంచమే గర్వపడే విధంగా యాదగిరిగుట్ట దేవస్థానాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు. రైతు బంధు, రైతు బీమా ఇవ్వకుండా దాట వేసే ధోరణిలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే గ్రూపుల పార్టీగా అభివర్ణించారు. రేవంత్‌రెడ్డిది ఒక గ్రూపు, భట్టి విక్రమార్క ది మరో గ్రూప్, ఒక్కో మంత్రిది ఒక గ్రూపుగా మారి రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ అంటే ఒకటే నని, ఒకటే కేసీఆర్, ఒకటే పరిపాలన అని తెలిపారు. పదేండ్ల కాలంలో రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చక్కటి పరిపాలన చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హితవు పలికారు. అభివృద్ధిని పక్కనబెట్టి కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టే పనిలో పడ్డారని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే హైడ్రాను తీసుకొచ్చారన్నారు. పేద ప్రజలపైనే హైడ్రా ప్రయోగాన్ని సంధించి వారిని తీవ్ర ఇబ్బంది పెట్టే పనిలో ఉన్నారని మండిపడ్డారు. తమ సంస్థలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే స్వచ్ఛందంగా తొలగిస్తామని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 25 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో చెత్తా చెదారాన్ని తొలగించారు . మున్సిపల్ సిబ్బంది, ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఇంటింటికీ పూలు, దానిమ్మ, ఉసిరి, జామ, కానుగ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ 6 మొక్కలు పంపిణీ చేస్తామని, నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, నాయకులు వనం వెంకటేశం, మాచర్ల వినోద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చేనేత జౌళి శాఖ ఆర్‌డీడీ పద్మను కలిసిన చేనేత నాయకులు

చేనేత సమస్యలు పరిష్కరించాలి

భూదాన్ పోచంపల్లి , సెప్టెంబర్ 25 : చేనేత సమస్యలు పరిష్కరించాలని, గతంలో రాష్ట్రంలో అమలు చేసిన 40 శాతం యారన్ సబ్సిడీ పొదుపు పథకం అమలు చేయాలని కోరుతూ చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం బుధవారం భువనగిరిలో చేనేత జౌళి శాఖ ఆర్‌డీడీ పద్మను కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వర్క్ షెడ్లు నిర్మించాలని, సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, చేనేత రుణాలు మాఫీ చేయాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ మహమూద్ కామిల్, నాయకులు మంగళపల్లి శ్రీహరి, నాగేశ్, బింగి భాస్కర్, కస్తూరి భిక్షపతి, రాపోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ

వరి ధాన్యానికి బోనస్ రూ.500 ఇవ్వాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 25 : అన్ని రకాల వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శివారెడ్డి గూడెంలో బుధవారం సీపీఎం గ్రామ శాఖ 13వ మహాసభలో ఆయన మాట్లాడారు. మూసీ నీళ్లతో కేవలం దొడ్డు వడ్లు మాత్రమే పండుతాయని, ఒక్క శాతం కూడా సన్న రకం వరి ఈ ప్రాంతంలో పండదని తెలిపారు. ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించిందని, దాంతో పోచంపల్లితోపాటు మూసీ ప్రాంత రైతులంతా నష్టపోతారని తెలిపారు. గత ప్రభుత్వం రైతుబంధు కింద పంట సహాయం అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టి ఇవ్వకుండా అడ్డుకుంటున్నదని విమర్శించారు. ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కోటా రామచంద్రారెడ్డి, మంచాల మధు, మండల కమిటీ సభ్యుడు నోముల కృష్ణారెడ్డి, శాఖ కార్యదర్శి వారాల మల్లారెడ్డి, ఎరబోల వెంకటేశం, కళ్లెం లక్ష్మీనరసింహారెడ్డి, వారాల సురేందర్ రెడ్డి, వారాల జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 25: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భువనగిరి పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన పద్మశాలి కులస్తుడు నిడిగొండ శివశంకర్ (47) ఆర్‌బీనగర్‌లో ఓ షాపును అద్దెకు తీసుకుని మిర్చి బజ్జీల వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. రోజువారీగా బుధవారం ఉదయం ఇంటి నుంచి ఆర్‌బీనగర్‌లో రెంటుకు తీసుకున్న షాపు వద్దకు వచ్చాడు. షాపులో మిర్చి బజ్జీల వ్యాపారం నిర్వహించకుండా ఆదే షాపు పైకప్పునకు తాడుతో ఉరి వేసుకున్నాడు. సాయంత్రం వరకు ఇంటికి రావపోవడంతో అతని భార్య అమరావతి షాపు వద్దకు వచ్చి చూడగా డోర్ వేసి ఉంది. స్థానికుల సహాయంతో డోర్‌ను తెరవగా ఉరి వేసుకుని మృతి చెందినట్లు గమనించారు. పోలీసులు మృతదేహాన్ని ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ కుమార స్వామి తెలిపారు.

28న ఫుట్‌బాల్ అండర్ 17 బాలబాలికల ఎంపిక

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 25 : 68వ పాఠశాల క్రీడల్లో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ అండర్-17 బాలబాలికల జట్ల ఎంపికలు ఈ నెల 28న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలేరులో నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుట్ బాల్ ఎంపికలో పాల్గొనే బాలబాలికలు జనవరి 1, 2008 తర్వాత జన్మించి ఉండాలని, పూర్తి వివరాలకు కార్యనిర్వాహక కార్యదర్శి గడసంతల మధుసూదన్‌ను 9000989671 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎల్ ఐసీని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

● ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య

సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ శాఖ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ పాలకులు ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ ఐసీని నిర్వీర్యం చేసే కుయత్నాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఐఆర్‌డీఏ ద్వారా సంస్థ మార్కెటింగ్ విధానాల్లో కొత్త పద్ధతులను ప్రవేశపెడుతూ ఫీల్డ్ ఫోర్స్ అయిన ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు సమస్యలు కలుగజేస్తున్నారని అన్నారు. దీనివల్ల మార్కెట్లో ఎల్ఐసీ పట్ల అనుమానాలు రేకెత్తుతున్నాయని వాపోయారు. 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కార్మికుల మీద రుద్దుతున్న పాలకుల దురుద్దేశాలను ఉద్యోగులు, కార్మికులు నిశితంగా గమనించి ఐక్యమత్యంతో పోరాటం ద్వారా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నవీన్, బాలకృష్ణన్, రమేశ్, శ్రావ్య, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బొమ్మలరామారం, సెప్టెంబర్25 : పంచాయతీ కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి హర్ష అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు పని ప్రదేశంలో వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డాక్టర్లు వినయ్, వరుణ్, జల్నిల్, వైద్య సిబ్బంది జనార్దన్, సుమతి, ప్రవీణ్, నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శులు పద్మజ, అమిత్, పవన్, వెన్నెల, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : స్వచ్ఛత హీ సేవ ర్యాలీలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు, వైద్య సిబ్బంది

పొడిచేడులో..

మోత్కూరు : మండలంలోని పొడిచేడులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పారిశుధ్య సిబ్బందికి వైద్య శిబిరంను నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పారుశుధ్య సిబ్బంది తమ విధుల నిర్వాహణలో తీసుకోవాలని మోత్కూరు ఎంపీడీఓ ఎండీ నిరంజన్‌వలీ ఈ సందర్భంగా వారికి సూచించారు. ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ వైద్యాధికారి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

మోత్కూరు : పొడిచేడులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

శారాజీపేటలో..

ఆలేరు రూరల్ : మండలంలోని శారాజీపేటలో పీహెచ్ సీలో బుధవారం వైద్యాధికారి మొసెజ్‌రాజ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, వైద్య సిబ్బంది యాకయ్య, పెద్ద లక్ష్మి, సురేశ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శారాజీపేట పీహెచ్‌సీలో పంచాయతీ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మొసెజ్‌రాజ్